www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 18 ఏప్రిల్ 2023

5

ఏలూరు

178 మంది సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ఖరారు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండో విడతలో 2020లో విధుల్లో చేరిన ఉమ్మడి జిల్లాలోని 178 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ఖరారైంది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9,780 గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రక్రియ చేపట్టింది. అయితే తొలివిడతలో 7,911 మంది మాత్రమే ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2019 అక్టోబర్ రెండో తేదీన వీరంతా విధుల్లో చేరారు. వీరికి 2022 జులైలో తొలివిడతగా 7,610 మందికి ప్రొబేషన్ ఖరారైంది. ఇప్పుడు మళ్లీ రెండేళ్ల సర్వీసు, శాఖాపరమైన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 178 మంది ఉద్యోగుల ప్రొబేషన్ ఖరారు చేసింది. మొత్తం 8,710 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉండగా ఇప్పటివరకు 7,788 మంది ప్రొబేషన్ ఖరారైంది. ఇప్పుడు రెగ్యులర్ అయిన ఉద్యోగులకు మే నుంచి కొత్త జీతాలు వర్తించనున్నాయి. రెండో విడతలో ప్రొబేషన్ ఖరారైన సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ఖరారు పత్రాలను జిల్లా కలెక్టర్ త్వరలో అందించనున్నారు.

'కొల్లేరు'లో దాహం తీరేదెలా..!

లంక గ్రామాల్లో తాగేందుకు గుక్కెడు నీళ్లు కరువు

కొనుగోలు చేస్తేనే గొంతు తడిచేది

తాగునీటి పథకాల ఏర్పాటులో తాత్సారం

విచ్చలవిడిగా ఆక్వా చెరువుల తవ్వకాలు

తాగునీటి చెరువులకు మాత్రం అనుమతులు నిల్

వేసవిలో పరిస్థితి మరీ దారుణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు గ్రామాల ప్రజలు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏళ్ల తరబడి తాగునీటి కోసం కొల్లేరు ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆక్వా చెరువుల తవ్వకాలతో తాగునీటి కోసం కొల్లేరు ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొల్లేరు గ్రామాలకు తాగునీటి పథకాలు మంజూరు చేస్తున్నట్లు కాగితాల్లో చూపించడం తప్ప వాటిని అమల్లోకి తెచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాలు కొల్లేరును ఆనుకుని ఉన్నాయి. కొల్లేరులో దాదాపు 130కిపైగా లంకగ్రామాలు ఉన్నాయి. ఐదు లక్షలకుపైగా జనాభా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. లక్షల జనాభాకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోని పరిస్థితి నెలకొంది. దీంతో కొల్లేరు గ్రామాల ప్రజల తాగునీటి ఇబ్బందులు తారాస్థాయికి చేరాయి. గడగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎంఎల్ఎలను నిలదీస్తున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో కొల్లేరు గ్రామాల్లో తాగునీటి సమస్యపై ఎంఎల్ఎలు పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ ఏకరువుపెట్టారు. ఆగడాలలంకలో రూ.29 కోట్లతో తాగునీటి స్కీము ప్రకటించినా ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. మరో గ్రామంలో రూ.నాలుగు కోట్లతో తాగునీటి పథకం ప్రకటించినా అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారైంది. దీంతో ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి తాగునీరు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల్లో స్నానం చేయడానికీ నీళ్లు పనికిరావడం లేదని ప్రజాప్రతినిధులే చెబుతున్న పరిస్థితి ఉంది. దీన్నిబట్టి కొల్లేరులో తాగునీటి సమస్య ఏవిధంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదు.

ఆక్వా చెరువులు తవ్వేస్తారు.. తాగునీటి చెరువులకు అనుమతి లేదంట..!

కొల్లేరు ప్రజల తాగునీటి సమస్యపై ప్రతియేటా వేసవికి ముందు చర్చించడం తర్వాత మరిచిపోవడం షరా మామూలు అన్నట్లు తయారైంది. సమావేశాల్లో అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ చెప్పడం, తర్వాత పనులు మాత్రం ముందుకు సాగకపోవడం సర్వసాధారణమైంది. ఆక్వా చెరువుల కారణంగా తాగునీటి వనరులన్నీ కలుషితమైపోవడంతో కొల్లేరు ప్రజల దాహం కేకలు రోజురోజుకీ మిన్నంటుతున్నాయి. కొల్లేరు గ్రామాల్లో ప్రస్తుతమున్న తాగునీటి చెరువులు జనాభాకు సరిపడా లేకుండాపోయాయి. ప్రస్తుతం ఉన్న చెరువుకు ఆనుకుని మరో చెరువు తవ్వుకునేందుకు భూమి కొరత లేదు. అయితే చెరువు తవ్వుకునేందుకు ఫారెస్టు అధికారుల అనుమతి అవసరం. ప్రతియేటా దీనిపై చర్చ సాగుతున్నా ఇప్పటి వరకూ అనుమతులు మాత్రం రాలేదు. కొల్లేరులో అనుమతి లేకుండా ప్రతియేటా వందల, వేల ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలు సాగిపోతున్నాయి. ప్రజలకు అవసరమయ్యే తాగునీటి చెరువుల తవ్వకాలకు మాత్రం అనుమతులు లేవంటూ కాలయాపన చేస్తున్నారు. కొల్లేరులో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు సరైన ప్రణాళికలు తయారు చేయడంలో విఫలమైనట్లు స్పష్టంగా తెలుస్తోంది. ప్రభుత్వం పట్టించుకోకపోవడం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగునీటి చెరువులు కొత్తవి పూర్తయ్యేసరికి సమయం పడుతోంది. ప్రస్తుత వేసవిలో కొల్లేరు ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది. కొల్లేరులో కొత్త తాగునీటి చెరువుల తవ్వకాలు ఆర్‌డిఒ, తహశీల్దార్ పర్యవేక్షణ పూర్తి చేస్తామని ఇటీవల నిర్వహించిన డిఆర్‌సి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. ఈ వేసవిలోనైనా మాట నిలబెట్టుకుంటారో లేదో వేచిచూడాలి.

సహకార సంఘాల నిర్వీర్యానికి కుట్ర

బలోపేతం చేయాలని కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ధర్నా

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నేత

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. సోమవారం అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు జిల్లా నలుమూలల నుండి ఉద్యోగుల హాజరయ్యారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఎన్నికల ముందు సహకార సంఘాలను పటిష్టం చేస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి ప్రస్తుతం సహకార సంఘాలనే ప్రయివేటు పరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చట్ట సవరణ ప్రకారం 50 శాతం షేర్లను బయట వ్యక్తులకు, సంస్థలకు అమ్మే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, చట్ట సవరణను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అదే చట్టసరణలో ఆర్‌బికెలను సహకార సంఘాల్లో విలీనం చేయొచ్చనే తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు టి.గంగరాజు, జిల్లా కార్యదర్శి పి.సుబ్బారావు మాట్లాడుతూ పిఎసిఎస్‌ను ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు అమ్మే ప్రయత్నాలు విరమించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాలను సంఘాల్లో విలీనం చేస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను రద్దు చేయాలన్నారు. జిఒ 36 ప్రకారం వేతనాలను ఇతర బెనిఫిట్లను వెంటనే అమలు చేయాలని కోరారు. 2019 నుండి కొత్త వేతన సవరణ చేయాలనీ, ధాన్యం సేకరణలో సంఘాలకు కలుగుతున్న ఇబ్బందులను నష్టాలను తొలగించాలనీ, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. టిడిఎస్ సహకార సంఘాలకు వర్తింపచేయరాదన్నారు. జిల్లా డిసిసిబి వెనక్కి కట్టించుకున్న ఆరు శాతం వడ్డీ రాయితీ వెంటనే సర్దుబాటు చేయాలని, 2010-11 నుండి నేటి వరకూ 13 సంవత్సరాల క్రితం సహకార సంఘాల ధనంపై రావాల్సిన ఆరు శాతం డివిడెండు లేదా వడ్డీ వెంటనే చెల్లించాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిమాత్రం సమర్పించారు. ఈ ధర్నాకు జి.వీరయ్య, పి.రాధాకృష్ణ, ఆర్.గణేష్, సర్వేశ్వరరావు, సత్యనారాయణరాజు, లక్ష్మీనారాయణ, జివికె.కుమార్ ప్రసంగించారు.

సొసైటీ ఉద్యోగుల ఆందోళనకు తెలుగుదేశం మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులకు తెలుగుదేశం పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఉద్యోగుల దీక్షా శిబిరం వద్దకు వచ్చిన టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు మాజీ డిప్యూటీ మేయర్, టిడిపి నాయకులు బోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నూజివీడు టౌన్: సీనియర్ న్యాయవాదులకు నేర శిక్షా స్మృతి సెక్షన్ 160 కింద నోటీసులు జారీ చేయడం రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగించడమేనని ఐలు నూజివీడు అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీనివాసరెడ్డి, బి.చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు సిఐడి అధికారుల చర్యను ఖండిస్తూ సోమవారం వారు నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలు రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎన్.పద్మాంజలి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఐ.సత్యప్రకాష్, కార్యదర్శి మడుపల్లి మధు, రవి, శంకర్, ఐలు సభ్యులు, సీనియర్ న్యాయవాదులు రామిసెట్టి సత్యనారాయణ, గోవాడ నీలాంబరం, బసవరాజు రామకృష్ణ, వై.ఏడుకొండలు, జి.కృష్ణ, జి.రవి, అక్కినేని రమాకుమారి, జూనియర్ న్యాయవాదులు జయశ్రీ, దీపిక పాల్గొన్నారు.

ఏలూరు డిగ్రీ కళాశాలకు భవనాలు నిర్మించాలని ధర్నా

ఏలూరు: ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయింపు, శాశ్వత భవనాలు వెంటనే ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థుల చదువులు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవనాల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హాజరై విద్యార్థులకు మద్దతు తెలిపి, ఉద్యమంలో వారికి తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు విద్యార్థులతో కలిసి దీక్షలో కూర్చున్నారు. ఆయన మాట్లాడుతూ ఏలూరులో 2008లో ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ సమస్య పరిష్కరించాలన్నారు. విద్యార్థులు చేసే ప్రతీ ఉద్యమంలో తన పాత్ర పోషిస్తానని హామీ ఇచ్చారు. టిడిపి నేత బడేటి చంటి, కాంగ్రెస్ పార్టీ ఏలూరు పట్టణ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, ఆమ్ఆద్మీ పార్టీ నేత మస్తాన్, సిపిఐ నాయకులు కృష్ణచైతన్య, సిఐటియు నాయకులు డి.ప్రసాద్, గంగరాజు, వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల పిడిఎస్‌యు నాయకులు క్రాంతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, ఎఐఎస్ఎఫ్ నాయకులు అనిల్ మద్దతు తెలిపారు. ఈ దీక్షలో పి.దుర్గాప్రసాద్, వి.ఠాగూర్, నవీన్‌కుమార్, 30 మంది విద్యార్థులు హాజరయ్యారు.

స్పందన అర్జీదారులను సంతృప్తిపరచాలి : కలెక్టర్

ఉంగుటూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సంతృప్తికరంగా, నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి ఆడిట్ కమిటీ పరిష్కరించిన స్పందన అర్జీలను ప్రతీ సోమవారం ఆడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నారాయణపురంలోని లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో జిల్లాస్థాయి స్పందన నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణి, ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, ఆర్‌డిఒ పెంచల కిషోర్, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయ రాజుతో కలిసి ప్రజల నుంచి స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తుందని, ఈ కార్యక్ర మానికి వచ్చే ప్రతిఅర్జీని నిశితంగా పరిశీలించి నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల ప్రజలు అర్జీలు సమర్పించేందుకు ఏలూరు రావాల్సిన అవసరం లేకుండా నియోజకవర్గ, జిల్లాస్థాయిల్లో స్పందన నిర్వహిస్తున్నామన్నారు. ఈ స్పందనలో 102 అర్జీలు స్వీకరించామని తెలిపారు.

జగనన్న ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ అసంతృప్తి

జగనన్న హౌసింగ్ లేఅవుట్ పనులు త్వరితగతిని పూర్తిచేయడానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం నారాయణపురంలో నిర్వహించిన స్పందనలో పాల్గొన్న కలెక్టర్ అనంతరం యర్రమిల్లిపాడులో 32 మంది కుటుంబాలకు కేటాయించిన హౌసింగ్ లేఅవుట్ పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. 32 లేఅవుట్లలో 16 స్థలాలు బేస్‌మెంట్ లెవెల్ కూడా పూర్తిచేయకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకొని హౌసింగ్ అధికారులపై ఆగ్రహం వెల్లబుచ్చారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం లే అవుట్లలో ఉన్న మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఉంగుటూరు ఉన్నత పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ పనుల్లో పురోగతి లేకపోవడంతో అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. త్వరితగతిని పనులు పూర్తిచేసి వచ్చే విద్యాసంవత్సరానికి సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. అనంతరం నల్లమాడులో ఉపాధి హామీ ద్వారా అమృతసరోవర్ కింద అభివృద్ధి చేస్తున్న మైనర్ ఇరిగేష్ చెరువు పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్దేశించిన పనిదినాలను కూలీలకు తప్పనిసరిగా కల్పించాలన్నారు. అడిగిన వారందరికీ పని కల్పించాలని డ్వామా పీడీ రాముకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సత్యనారాయణ, ఎంపిడిఒ ఆంజనేయబాబు, డిప్యూటీ డిఇఒ అవధాని, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

బిజెపి నిరంకుశ పాలనను ఎండగట్టాలి

సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి యాత్రలో నేతలు



ఉంగుటూరు మండలంలో..

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ చేపట్టిన రాజకీయ ప్రచార భేరి యాత్రలు జిల్లాలో సోమవారం కొసాగాయి. ఈ సందర్భంగా ప్రజలకు, ఉపాధి కూలీలకు, కార్మికులకు మోడీ ప్రజావ్యతిరేక విధానాలను కరపత్రాల ద్వారా వివరిస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బిజెపి ప్రజ్యాతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - చింతలపూడి

మోడీ ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. సిపిఎం, సిపిఐ దేశరక్షణ ప్రచార భేరి యాత్ర పట్టణంలో సోమవారం సాగింది. కొత్తబస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకూ కరపత్రాలను పంచుతూ యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు దొంత కృష్ణ, తుర్లపాటి బాబు, జానీ, సిపిఎం నాయకులు ఎస్.సూర్య కుమార్ పాల్గొన్నారు.

నిడమర్రు : బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి యాత్ర మండలంలో సోమవారం చేపట్టారు. స్థానిక నిడమర్రు సెంటర్‌లో సిపిఐ రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ యాత్రను ప్రారంభించారు. నిడమర్రు, అడవికొలను, ఎనికేపల్లి, భువనపల్లి, మందలపర్రు గ్రామాల్లో ఈ యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు, సిపిఎం నాయకులు కె.వెంకట్రావు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, ఆర్.నాగరాజు, వెలగలేటి మోహన్, ఆలమండ రాము పాల్గొన్నారు.

ఉంగుటూరు : బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ చేపట్టిన ప్రచార భేరీ యాత్రను మండలంలో సాగింది.

కొయ్యలగూడెం మండలంలో..

మండలంలోని నారాయణపురం, ఉంగుటూరు, పెదవెల్లమిల్లి, చేబ్రోలు, గొల్లగూడెం, కైకరం గ్రామాల్లో సాగింది. సిపిఐ రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ధరలు విపరీతంగా పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు దారుణంగా పెంచేశారని విమర్శించారు. మరోవైపు దేశ సంపదను అంబానీ, అదానీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను అందరూ నిరసించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి నిధులు కేంద్రమే భరించాలని కోరారు. రైతులు పండించిన ధాన్యంలో 60 శాతం మాత్రమే కొనుగోలు చేయాలని కేంద్రం నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, సిపిఎం నాయకులు కొక్కెరపాటి వెంకట్రావు, రాచమంటి నాగరాజు, టి.శ్రీను, కోండ్రు చినఅంజయ్య పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సిపిఎం, సిపిఐ ప్రచారభేరి యాత్ర మండలంలో సోమవారం సాగింది. సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మొడియం నాగమణి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. మండలంలోని గవరవరం, చొప్పరామన్నగూడెంలోని చెరువుల వద్ద ఉపాధి కూలీల వద్దకు వెళ్లి మోడీ ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం నాగమణి మాట్లాడుతూ రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తుందన్నారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీను, సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్‌కె.బాబ్జీ, సిపిఎం నాయకులు కె.సీతారాములు, సిహెచ్.సత్యనారాయణ, బి.రమేష్ ముళ్లపూడి మధు, దాసరి వీర్రాజు, రేలా అన్నవరం పాల్గొన్నారు. ఎర్రంపేట, గంగన్నగూడెం, తిమ్మనకుంట, రాజవరం, కనకాద్రిపురం, పొంగుటూరు గ్రామాల మీదగా యాత్ర సాగింది.

జంగారెడ్డిగూడెం : సిపిఎం, సిపిఐ దేశ రక్షణ ప్రచార భేరి ప్రచార యాత్ర మండలంలోని గురవాయిగూడెం, పుట్లగట్లగూడెం, దేవులపల్లి, లక్కవరం, పంగిడిగూడెం, కేతవరం గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా లక్కవరం-పంగిడిగూడెం చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, టివిఎస్.రాజు మాట్లాడారు. ఈ యాత్రలో సిపిఎం మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, బొడ్డు రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి రమణరాజు, గోలిమే బాలఏసు పాల్గొన్నారు.

పెదపాడు : బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలను నిరసిస్తూ దెందులూరు నియోజకవర్గంలో సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్రను ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ తెలిపారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో ప్రచార భేరి యాత్ర పోస్టర్లను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లింగం కృష్ణారావు, గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా, రెడ్డి లక్ష్మణరావు, షేక్ బాషా పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

నిడమర్రు మండలంలో..

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

జిల్లావ్యాప్తంగా ఆదివాసీల ఆందోళన

ప్రజాశక్తి - కుక్కునూరు

బిసిలకు చెందిన బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం కుక్కునూరులో ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు కూరం సంజీవరావు మాట్లాడారు. ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని భేషరతుగా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అనాలోచిత తీర్మానాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఆదివాసీల హక్కులను, చట్టాలను, మూలాలను సమూలంగా నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్న సిఎం జగన్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీల్లోని గిరిజన ప్రజాప్రతినిధులు రాజీనామా చేసి ప్రత్యక్ష ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ ప్రమద్వరకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కివ్వాక సర్పంచి మడివి రాజులు, మారేడుబాక సర్పంచి మడకం తిరుపతమ్మ, జెఎసి నాయకులు వర్సా నాగేశ్వరరావు, మడకం నాగేశ్వరరావు, పైదా పరమేష్, మడకం వెంకటేష్, చిన్నబాబు, కంటిపల్లి పాండురాజు, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బోయ, వాల్మీకులను ఎస్‌టిలో జాబితాలో చేర్చొద్దంటూ అఖిల భారత రైతు కూలీ సంఘం,



కుక్కునూరులో..

అఖిలభారత ఆదివాసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. తొలుతస్థానిక పార్టీ కార్యాలయం రావ నరసయ్య భవనం నుండి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, నెహ్రూ సెంటర్ మీదుగా తిరిగి తహశీల్దార్ కార్యాలయానికి చేరింది. తహశీల్దార్ ఎస్ఎస్.శాంతికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.సురేష్ మాట్లాడారు. ఈ ర్యాలీలో కట్టం నాగేశ్వరరావు, నడపాల రాజు, కరకాల రామిరెడ్డి, కె.రాజు, మల్లం పెంటయ్య, కోరం దుర్గారావు, కోరం భీమన్న, గంగిరెడ్డి, గుజ్జు రమేష్‌బాబు, పండు ధర్మరాజు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయాన్ని విరమించుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం, అఖిలభారత ఆదివాసీ హక్కులవేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇ.భూషణం, అఖిలభారత రైతుకూలి సంఘం మండల అధ్యక్షులు నాగన్న, మండల కార్యవర్గ సభ్యులు ఎడ్లపల్లి నాగేశ్వరరావు, కుమ్మరపల్లి రాములు, గంగరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో..

ధాన్యం కొనుగోలు పరిమితి పెంచాలని ధర్నా



కలెక్టర్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

ఉంగుటూరు: రబీ ధాన్యం కొనుగోలు పరిమితి పెంచి ఎకరాకు 110 గోనె సంచులు ఇవ్వాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు చెల్లించాలని, బాదంపూడి సొసైటీ బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నారాయణపురంలో నిర్వహించిన జిల్లా స్పందన కార్యక్రమం వద్ద సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం ముందుగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు, జెసి లావణ్య వేణికి వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండిన పంటలో 60శాతం మాత్రమే కొనుగోలు చేయాలనే ప్రభుత్వ నిబంధన సరికాదన్నారు. పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు పరిమితి 40 బస్తాల నుండి 55 బస్తాలకు పెంచి ఎకరాకు 110 గోనె సంచులు ఇవ్వాలని కోరారు. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలన్నారు. మొక్కజొన్న పంట రైతుల చేతికి వచ్చిన దశలో మద్దతు ధర కంటే వ్యాపారులు తక్కువకు కొనుగోలు చేయడం వలన మొక్కజొన్న రైతులు నష్టపోతున్నారని చెప్పారు. మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయా లని కోరారు. మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు చెల్లించాలన్నారు. బాదంపూడి సొసైటీ బాధిత రైతుల కు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, బి.సత్య నారాయణ, డి.కేశవరావు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు : జెసి

ఉంగుటూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జెసి బి.లావణ్యవేణి తెలిపారు. మండలంలోని నారాయణపురం, చేబ్రోలు రైతు భరోసా కేంద్రాలను ఆమె సోమవారం పరిశీలించారు. రైతులకు గోనె సంచులు సరఫరాలో జాగ్రత్త వహించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు ఏ మేరకు సిద్ధంగా ఉన్నదీ పరిశీలించారు. కొనుగోలు కేంద్రం వద్ద సౌకర్యాలను, తేమశాతం కొలిచే యంత్రాలను జెసి పరిశీలించారు. జిల్లాలో ఉన్న 247 రైతు భరోసా కేంద్రాలకు గాను వాటిలో కొన్ని కేంద్రాలను ఒక్కో క్లస్టర్ గుర్తిస్తూ 136 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేశామన్నారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన 18004256453 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలన్నారు. ధాన్యం రవాణాలో ఇబ్బందులు లేకుండా లారీ అసోషియేషన్ వారితో కూడా చర్చించి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

నేడు మంత్రి జోగి రమేష్ ఏలూరు రాక

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు జోగి రమేష్ మంగళవారం ఏలూరు పర్యటన సందర్భంగా సంబంధిత ఏర్పాట్లపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంత్రి పర్యటనకు సంబంధించి వివిధ అంశాలపై సంబంధిత జిల్లా అధికారులతో పాటు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం అమలుపై సమీక్షించేందుకు మంత్రి జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజేయ్ జైన్ ఏలూరు విచ్చేస్తున్నారన్నారు. ఈ సమీక్షకు సంబంధించి ఆయా అంశాలపై సంబంధిత అధికారులు ముఖ్యంగా సంబంధిత మండల తహశీల్దార్, ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇలు పూర్తి స్పష్టతతో ఉండాలని తెలిపారు.

పర్యటన వివరాలు

మంగళవారం ఉదయం 10.45 గంటలకు ఏలూరు మండలంలో ఉన్న పోణంగి లే అవుట్‌ను పరిశీలిస్తారు. అనంతరం జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో గోదావరి సమావేశ మందిరంలో హౌసింగ్, రెవెన్యూ, డ్వామా, పంచాయతీరాజ్, ఎపిఇపిడిసిఎల్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో పేదలందరికీ ఇళ్ల కార్యక్రమ పనుల పురోగతిపై సమీక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు భీమడోలులోని వైఎస్ఆర్ జగనన్న కాలనీని సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు భీమడోలు నుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్‌పి డి.మేరీప్రశాంతి అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలపై సంబంధిత స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి వాటి పరిష్కారంపై ఎస్‌పి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

'అమృత్ సరోవర్' పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నల్లమాడులో గవ్వలగుంట చెరువులో ఉపాధి హామీ కూలీలతో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జరుగుతున్న పనులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సోమవారం పరిశీలించారు. ఆరు ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో 3500 మంది కూలీలతో తవ్వించి చెరువు చుట్టూ గట్లు పటిష్ఠం చేయనున్నారు. ఈ నెలాఖరు నాటికి అమృత్ సరోవర్ పథకం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో ఒకేషనల్ టెన్త్ పరీక్షా కేంద్రాలను ఎస్‌పి డి.మేరీప్రశాంతి సోమవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, విద్యార్థులకు మౌలిక సదుపాయాలపై పరిశీలించారు. అనంతరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. ఫిర్యాదుదారుల సమస్యలపై సత్వరమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లకు ఆయా సమస్యలపై వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, ప్రతి ఫిర్యాదును రిజిస్టర్లో నమోదు చేయాలని తెలిపారు.

'కంటి వెలుగు' సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

అంధత్వ నివారణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం సేవలను వినియోగించుకోవాలని పోలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహిమా బేగం హసేన కోరారు. స్థానిక బిసి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేదికగా ఆప్తాలిక్ అధికారి డాక్టర్ జె.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ పరిధిలో ఈ నెల 17వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సేవలు కొనసాగుతాయని సర్పంచి తెలిపారు. విద్యార్థులకు, 60 ఏళ్లు దాటిన వారికి పథకం సేవలను ఉచితంగా అందించేందుకు ప్రత్యేకించారన్నారు. ఈ మేరకు గ్రామ పరిధిలో ఈ తరహా వ్యక్తులు 400 మంది వరకు ఉంటారని ప్రాథమిక అంచనా వేశామన్నారు. ఈ సందర్భంగా ఆప్తాలిక అధికారి డాక్టర్ జె.వెంకటరెడ్డి మాట్లాడుతూ శిబిరంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు, అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ, ,శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు, మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుతం గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొనసాగుతున్న సేవలు ఆ తర్వాత కాలంలో పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు అంబటి దేవినాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమడోలు

అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారికి మనోధైర్యాన్ని కల్పిస్తూ, ప్రాథమిక దశలో ప్రథమ చికిత్స అందించడం ద్వారా వారు తొందరగా కోలుకునే అవకాశం ఉంటుందని భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు తెలిపారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు సోమవారంతో నాలుగో రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో భాగంగా భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల వేదికగా అగ్నిమాపక కేంద్రం అధికారి విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకునే తీరు ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించే విధానాలపై డెమో ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. సాధారణంగా పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాల జరుగుతాయని, వీటి నివారణకు నాణ్యత గల విద్యుత్ సరఫరా పరికరాలను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తోపులాటకు చోటు లేకుండా క్రమ పద్ధతిలో ప్రత్యేకించిన మార్గాల ద్వారా సురక్షితంగా ప్రమాదాల నుంచి బయటపడవచ్చని వివరించారు. ప్రస్తుతం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ఇతరులకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానస పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, భీమడోలు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పని చేయని చేతి పంపులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తుక్కులూరు, దేవరగుంట, కొత్తూరు, అన్నవరం గ్రామాల్లో చేతి బోరు పంపు పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నీటి ఎద్దడి రాకుండా చేతి బోరు పంపులకు మరమ్మతులు చేయాలని, అవి బాగుపడని పక్షంలో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై గ్రామపంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.

నేరాలు - ఘోరాలు

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొర్రంపాలెంలో వీరమల్ల వెంకటేశ్వరరావు నాటుసారా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, చింతలపూడి కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. మండలంలోని కన్నప్పగూడెం గ్రామ శివారులో వగ్గల నాగరాజు నాటుసార తయారు చేస్తున్నాడన్న సమాచారం మేరకు దాడి చేసి అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి అతడిని చింతలపూడి కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్థత

జీలుగుమిల్లి :మండలంలోని ములగలంపల్లి గ్రామానికి చెందిన ఈడ ప్రసాద్ (50) సోమవారం పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. దీంతో అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు 108లో కామయ్యపాలెం పిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఖాళీ బిందెలతో ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

తాగునీరు అందించాలని, రోడ్డు నిర్మించాలని, వీధిలైట్లు వేయించాలని స్థానిక ఎస్‌టి హాస్టల్ వెనుక నివసిస్తున్న ప్రజలు ధర్నా చేశారు. ఖాళీ బిందెలతో ఎపి ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి కోసం ఎండలో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కుళాయి పంపులైనా బిగించాలని కోరారు. వీధిలైట్ల సౌకర్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు స్పందించాలని కోరారు. చింతలపూడి నగర పంచాయతీలోని బోయగూడెం పరిధిలో ఎస్‌టి హాస్టల్ వెనుక సుమారు 20 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. తాగునీటి సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరగడంతో తాగునీటి ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. తమ వీధిలో వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటునామని, విషసర్పలు సంచరిండంతో భయాందోళనకు గురవుతున్నామని చెప్పారు. తాము ఇంటి పన్నులు కడుతున్నామని, కుళాయి, వీధిలైట్లు వేయించాలని కోరారు. రోడ్లు కూడా వేయించాలని కోరారు. దీనిపై తహశీల్దార్ కృష్ణజ్యోతి మాట్లాడుతూ ప్రస్తుతం తాగునీటి ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తామని, త్వరలో పైపులైన్లు వేయిస్తామని తెలిపారు. అనంతరం స్పందన అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మార్తిన లక్ష్మి, కోట లక్ష్మి, ఐద్వా జిల్లా నాయకులు ఎం.వరలక్ష్మి దేవి, పట్టణ నాయకులు, కె.అనురాధ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న ప్రజలు

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

చింతలపూడి :మొక్కజొన్న పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి దొంత కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతలపూడి తహశీల్దార్ కార్యాయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశల్దార్ కృష్ణజ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దొంత కృష్ణ మాట్లాడుతూ మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల క్వింటాకు రూ.200 నుంచి రూ.300 వరకు రైతు నష్టపోతున్నాడన్నారు. ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ప్రాంతం మెట్ట ఏరియా కావడంతో ఇక్కడ పండిన బాయిల్డ్ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఎపి రైతు సంఘం నాయకులు ఎస్‌కె.జానీ, తాడిగడప మాణిక్యాలరావు, సిహెచ్.కనకాచారి, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పాల్గొన్నారు.

అవినీతిపరులు కాదని నిరూపించుకోగలరా..!

ఎంఎల్‌ఎ వెంకటప్రతాప్‌అప్పారావు వ్యాఖ్యలపై గద్దె రఘుబాబు స్పందన

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై సవాల్ విసరడంపై రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు స్పందించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో వైసిపి వారు అవినీతిపరులు కాదని నిరూపించుకోగలరా అని ప్రశ్నించారు. మండల పరిధిలో బెల్టు షాపునకు అనుమతులు ఇచ్చారన్నారు. సిఎం జగన్ అధికారంలోకొచ్చాక మద్య నిషేధం అమలు చేస్తానంటూ చెప్పడం తప్ప చేసినా దాఖలాలు లేవన్నారు. ఇసుక, మట్టి మాఫియా ఎక్కువవుతున్నాయన్నారు. అవినీతిపరులు కాదని నిరూపించుకోవడానికి ఎక్కడికైనా వస్తారా అని నూజివీడు ఎంఎల్‌ఎపై గద్దె రఘుబాబు సవాల్ విసిరారు.

ఆకట్టుకున్న పయనీర్ మొక్కజొన్న ప్రదర్శన

జంగారెడ్డిగూడెం :మండలంలోని కేతవరంలో కోర్టేవ పయనీర్ మొక్కజొన్న పి 3567 ప్రదర్శన పలువురు రైతులను ఆకట్టుకుంది. సోమవారం కేతవరం గ్రామంలో పయనీర్ కంపెనీ మేనేజర్ వివేక్, ఎండిఆర్.శ్రీనివాస్, కవులూరి అన్నవరం పొలంలో రైతులకు కోర్టేవ పయనీర్ మొక్కజొన్న పి 3567 రకం మొక్కజొన్న దిగుబడి ఆదాయం, మొక్కజొన్నలో పంట సంరక్షణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ రకం మొక్కజొన్న పంటలో 50 క్వింటాలు దిగుబడి సాధించిన రైతులను సన్మానించారు.

'రాష్ట్రంలో సుపరిపాలన'

మండవల్లి :రాష్ట్ర ప్రజలకు సుపరిపాలనను అందిస్తున్న ప్రజా నాయకుడు సిఎం జగన్ అని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కానుకొల్లులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న అందించిన ఫలాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచి నాగదాసి థామస్, ఎంపిటిసి సభ్యులు పొట్టి మీనాకుమారి, వెంకటరమణ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బేతపూడి ఏసేబురాజు, మండవల్లి పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ణ యాదవ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని వైసిపి సీనియర్ నాయకులు బత్తిన చిన్న అన్నారు. స్థానిక రాజీవ్ నగర్ బైపాస్ రోడ్డు వినాయక ఆలయం వద్ద భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని 28, 29 వార్డుల కౌన్సిలర్లు మానవతామూర్తి, కె.లావణ్య, బత్తిన చిన్నా సోమవారం ప్రారంభించారు. మొదటిరోజు సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పులకందం శ్రీనివాస్, ఈర్ని సూరిబాబు, లక్ష్మణరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు పాలవలస అప్పారావు గారి కుమారుడు పాలవలస యుగంధర్, తాడేపల్లిగూడెం, 2) మునగాల వాణిశ్రీ, భర్త : లేటు వెంకటేశ్వర రావు, నివాసం : విశాఖపట్నం గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా...,

నా క్లయింటు అమ్మమ్మ గారైన శ్రీమతి మంగి అచ్చాయమ్మ గారి ఆస్తులు ఆమె మరణానంతరం నా క్లయింట్లు తల్లిగారైన శ్రీమతి పాలవలస అరుణ మరియు పిన తల్లి గారైన శ్రీమతి కరణం భారతి అను వారులకు సంక్రమించినది. నా క్లయింటు తల్లి గారైన శ్రీమతి పాలవల స అరుణకు గల వాటా ఆస్తులలో నా క్లయింట్లు మరియు వారి ఇతర సోదరులకి కూడా జాయింటు హక్కులు కలవు. పై ఆస్తులన్నింటిపై హైకోర్టులో అప్పీలు పెండింగులో ఉన్నది. ఎ.ఎస్.నెం.931/2017 నా క్లయింట్లు తల్లిగారు ఇటీవల సదరు ఆస్తులను అమ్మివేయుటకు ప్రయత్నించుచున్నట్లుగా నా క్లయింట్లకు తెలియవచ్చినది. మంగి అచ్చాయమ్మ గారి ఆస్తులలో నా క్లయింట్లకు కూడా హక్కు కలదు. కావున సదరు మంగి అచ్చాయమ్మ గారి ఆస్థులపై నా క్లయింట్లు అనుమతి లేకుండా ఏవిధమైన అన్యాక్రాంతములు జరిపినా చెల్లవని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

స్థలం : ఏలూరు తేది : 17.04.2023

ఇట్లు : బి. గౌరీ శంకర్, (అడ్వకేట్)
ఏలూరు సెల్ : 74162 36226

ఎపిడబ్ల్యూజెఎఫ్ నియోజకవర్గ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - నూజివీడు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూజివీడు నియోజకవర్గ మహాసభ కెఎస్.శంకర్రావు అధ్యక్షతన స్థానిక రాయల్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మహమ్మద్ అలీ అబ్బాస్, నీలా వన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కిషోర్, గరికపాటి నాగ వలి కుమార్, జాయింట్ సెక్రటరీగా సీమటా శ్రీను, రవికుమార్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ముసునూరి సతీష్ కుమార్, శ్రీనివాస్, కోశాధికారిగా అబ్బుదాసరి వసంతరావు, మరో ఆరుగురితో నూతన కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఫెడరేషన్ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి.ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి కెఎస్.శంకర్రావు, జిల్లా పరిశీలకుడు వాతాడ నవీన్‌రాజు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల విలేకరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు విశాఖపట్టణం కాపురస్తులు అయిన శ్రీమతి కరణం భారతి, భర్త : బాబూరావు గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా...,

నా క్లయింటు తన సోదరి అయిన శ్రీమతి పాలవలస అరుణ, తండ్రి : లేటు అప్పారావు గారి పై తమ తల్లి గారైన శ్రీమతి మంగి అచ్చాయమ్మ గారి ఆస్తులు పంపకం నిమితం ఏలూరు జిల్లా కోర్టులో ఓ.ఎస్.నెం.24/2010కు దావా దాఖలు చేసినారు. సదరు దావా ది.28.04.2017వ తేదీన ప్రిలిమినరీ డిక్రీ పాస్ చేసినారు. ఆ తీర్పు పై పాలవలస అరుణ హైకోర్టులో అప్పీలు ఎ.ఎస్.నెం.931/2017 అప్పీలు దాఖలు చేసినారు. సదరు అప్పీలు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నది. ఇటీవల పాలవలస అరుణ మరియు ఆమె సంతతివారు మంగి అచ్చాయమ్మ గారి ఆస్థులు అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నించుచున్నట్లు నా క్లయింటుకు తెలియవచ్చినది. కావు ఇందుమూలముగా యావన్మందికీ తెలియచేయునది ఏమనగా సదరు మంగి అచ్చాయమ్మ గారి ఆస్థులు కోర్టు పరిధిలో ఉన్నందున ఏ విధమైన లావాదేవీలు జరిపినా చెల్లవని తెలియచేయడమైనది.

స్థలం : ఏలూరు తేది : 17.04.2023

ఇట్లు : బి. గౌరీ శంకర్, (అడ్వకేట్)
ఏలూరు సెల్ : 74162 36226

చీపురుగూడెంలో విజయ్‌చౌదరి వర్ధంతి సభ

ప్రజాశక్తి - చాట్రాయి

టిడిపి మండల మాజీ అధ్యక్షుడు బొట్టు విజయ్‌చౌదరి రెండో వర్ధంతి సభ మండలంలోని చీపురు గూడెంలో సోమవారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి మండలాధ్యక్షునిగా కొనసాగుతూ పదవిలో ఉండి అనారోగ్యంతో మరణించిన బొట్టు విజయ్‌చౌదరి ఆశయాలను సాధిస్తేనే ఆయన ఆత్మకు శాంతి చేకూరితుందన్నారు. మండల స్థాయిలో టిడిపిని ముందుకు తీసుకువెళ్లాలని, నూజివీడు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిని ఎంఎల్‌ఎగా గెలిపించుకోవాలని, అది జరిగినప్పుడే ఆయన ఆశయాలను సాధించిన వారవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, చింతలపూడి నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ గంటా మురళీరామకృష్ణ, టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, నూజివీడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, టిడిపి అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు, విజయ డెయిరీ జిల్లా డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, పుచ్చకాయల నోబుల్ రెడ్డి, చాట్రాయి మాజీ సర్పంచి కోట జోషి పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు సభ

ప్రజాశక్తి - భీమడోలు



వీడ్కోలు సభలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అన్నేవారిగూడెం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను వీడుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు ఇక్కడ నేర్చుకున్న చదువును పునాదిగా వేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ కోరారు. పాఠశాల ఆవరణలో సోమవారం తోటి విద్యార్థులు పాఠశాలను వీడుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ పి.మౌనిక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విజేతలకు పాఠశాల యాజమాన్యం బహుమతి ప్రదానం చేసింది. పలువురు వక్తలు పాఠశాలను వీడుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్ శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

జంగారెడ్డిగూడెం : ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు, రిజిస్ట్రర్ల నిర్వహణపై అవగాహన పొందాలని రైతు భరోసా కేంద్ర సిబ్బందికి కెఆర్.పురం వ్యవసాయ శాఖ ఎడిఎ బుచ్చిబాబు సూచించారు. మండలంలోని గురవాయిగూడెం రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలుపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ బుజ్జిబాబు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ధాన్యం నాణ్యతపై దృష్టి సారించాలని తెలిపారు. డిఎం సివిల్ సప్లై కార్యాలయ ప్రతినిధి జి.త్రివేణి (టిఎ) మాట్లాడుతూ ధాన్యంలో తేమశాతం చూడడం, నూకశాతం తెలుసుకోవడం, తప్పు, తాలు గింజల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి కెవిఎన్.పోసిరావు మాట్లాడుతూ మండలంలో 6,300 ఎకరాల వరి సాగు జరిగిందని తెలిపారు. మండలంలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

భవిత కేంద్రం పిల్లలకు వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు భవిత కేంద్రంలో వికలాంగ పిల్లలకు వాటర్ బాటిల్, టిఫిన్ బాక్స్, స్నాక్స్ లను చేబ్రోలు లయన్స్ క్లబ్ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, సెక్రటరీ అడపా శోభారాణి సోమవారం అందించారు. భవిత కేంద్రం నిర్వాహకులు రాజు, విమల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

19 నుంచి భీమడోలులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలో ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేయాలని భీమడోలు సొసైటీ అధ్యక్షులు, వైసిపి మండల కన్వీనర్ రాయపాటి సత్యశ్రీనివాస్ కోరారు. కార్యక్రమం కోసం ప్రత్యేకించిన వాల్‌పోస్టర్‌ను ఆయన భీమడోలులో ఆయన భీమడోలులో సోమవారం గ్రామ సర్పంచి సునీత మాన్ సింగ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే బాధ్యులకు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన దశా దిశా నిర్దేశకాలను చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్.తాగూర్, ఎంపిటిసి సభ్యులు ముళ్లగిరి జాన్సన్, వైసిపి ప్రముఖులు డాక్టర్ పి.మాన్‌సింగ్, రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం సొసైటీ సభ్యుడు ఓలేటి భాస్కరరావు (52) ఈ నెల 15వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పది వేల ఆర్థిక సహాయాన్నిభాస్కరరావు కుటుంబసభ్యుడు జైకిరణ్‌కు సొసైటీ ఛైర్మన్ బడుగు రంగారావు సోమవారం అందించారు. కెడిసిసిబి ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు నిర్ణయం మేరకు ఈ మొత్తాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ నీలం నాగేశ్వరరావు, వైసిపి నాయకులు రవి, నాగరాజు పాల్గొన్నారు.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 185/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ...*Plaintiff*
VS
Thonta Peddintlu another ...*Defendant*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) తొంట పెద్దింట్లు, భర్త: భాస్కరరావు, హిందువు, స్త్రీ, 32 సం॥లు, డో.నెం. 25-11-11/1, పాలకొల్లు, పాలకొల్లు JCJC.
2) వేముల శ్రీనివాసు, తండ్రి: భాస్కరరావు, హిందువు, పురుషుడు, 49 సం॥లు, డో.నెం. 22-5-8, పాలకొల్లు, పాలకొల్లు JCJC.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

T.RAMADEVI
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 297/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ...*Plaintiff*
VS
Arepalli Suresh another ...*Defendant*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) ఆరేపల్లి సురేష్, తండ్రి: సత్యనారాయణ, హిందువు, పురుషుడు, 53 సం॥లు, డో.నెం. 18-4-20/2 పాలకొల్లు.
2) వేముల వెంకట లక్ష్మి, భర్త: వర్ధనరావు, హిందువు, స్త్రీ, 36 సం॥లు, డో.నెం. 27-4-18, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 173/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ...*Plaintiff*
VS
Katta Vinod another ...*Defendant*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) కట్టా వినోద్, తండ్రి: వెంకట్రావు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2) వేముల జయరాజు, తండ్రి: యర్రియ్య, హిందువు, పురుషుడు, 45 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

T.RAMADEVI
Advocate, Tanuku.

In The Court Of The Ist Additional Junior Civil Judge :: Tanuku
O.S.No. 562/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ...*Plaintiff*
VS
Veligatla Subhashini another ...*Defendant*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) వెలిగట్ల సుభాషిణి, భర్త: రాజేశ్వరరావు, హిందువు, స్త్రీ, 38 సం॥లు, డో.నెం. 3-68, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2) రేలంగి నరసింహమూర్తి, తండ్రి: వెంకట్రావు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, డో.నెం. 24-15-19, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 285/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ...*Plaintiff*
VS
Thonta Prabhakara Rao another ...*Defendant*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) తొంట ప్రభాకరరావు, తండ్రి: సత్యనారాయణ, హిందువు, పురుషుడు, 52 సం॥లు, డో.నెం. 25-14-11/1, పాలకొల్లు.
2) తొంట జ్యోతిలక్ష్మి, భర్త: శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, 41 సం॥లు, డో.నెం. 25-8-12, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.

In The Court Of The Ist Additional Junior Civil Judge :: Tanuku
O.S.No. 556/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ...*Plaintiff*
VS
Katta Ramachandrarao another ...*Defendant*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) కట్టా రామచంద్రరావు, తండ్రి: గురుమూర్తి, హిందువు, పురుషుడు, 51 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2) వేముల బాలఫణి, తండ్రి: యర్రయ్య, హిందువు, పురుషుడు, 38 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.